కథా నిలయం
శ్రీకాకుళం

# ఎర

"ఇతన్ని నేను చూడలేదంటూ ఉంటే..." గట్టిగా అన్నాను, ప్రక్కనే కూర్చుని ఉన్న యువకుని చూస్తూ,

అధునిక యాజమాన్యపు పద్ధతులకు ప్రతీకలలా కనిపించాయి. మా బాస్ బల్లమీద ఉన్న జీవకళ ఉట్టిపడే ప్లాస్టిక్ పువ్వులు వాటిలో అమర్చిన ఎర్రగులాబీ కన్నా ఎర్రగా కనిపించేయి మా బాస్ కళ్ళు.

"అలా అంటారేంటి సార్" ఆ యువకుడు అన్నాడు "ఆరోజు ముసలయ్యతో మీ యింటికి వచ్చాను కదండీ?"

ముసలయ్యతోనా?

"ముసలయ్యని మీకు తెలసా?" మా బాస్ అడిగేడు.

ఓ సంవత్సరం నుంచి ముసలయ్యని నాకు తెలుసు. మా వీధి చివర ఉన్న పాకలో ఉండేవాడు. కిరసనాయిల్ బండి లాగేవాడు. ఓ మూడు నెలల క్రితమే ఓ చిన్న డిపార్టమెంటల్ షాపు పెట్టి, ఓ యిల్లు అద్దెకి తీసికొని ఉంటున్నాడు. కిరసనాయిలు బండిలాగేవాడు ఇంత డబ్బెలా సంపాదించాడా అని ఆలోచిస్తూ ఉంటాను అప్పుడప్పుడు.

"చెప్పండి ముసలయ్యని మీకు తెలుసా?" మా బాస్ మళ్ళీ అడిగేడు.

"తెలుసండీ" గొణిగేను.

ముసలయ్యతో చాలా వింతగా పరిచయం ఏర్పడింది నాకు.

ఆరోజు ఆఫీసు నుంచి ఇంటికి చేరేసరికి పశ్చిమాన్న పొయ్యి ఆరిపోయింది.

గేసు అయిపోయిందనీ, కిరసనాయిలు అయినా తీసుకురమ్మని చెప్పింది నా శ్రీమతి. గేసుకీ, కిరసనాయిలుకీ కూడా కొరతట; దొరకటం లేదట. కరంటు కొరతకి

గురవటం వలన దీపాలు వెలగని వీధులలో కిరసనాయిల్ డబ్బా పట్టుకొని నడిచాను.

ఆకాశాన చందమామ అనే పెట్రోమాక్స్ వెలిగింది. గానీ కిరసనాయిల్ దొరకలేదు. తిరిగి, తిరిగి అలసిపోయిన నాకు చూపించాడు ఒకడు, ముసలయ్య పాక.

"బలే చిక్కులో పెట్టేరండి తమరు" ముసలయ్య అన్నాడు. "కిరసనాయిల్ దొరికి సస్తేకదా ఇచ్చేది. లీటరు పదిదాకా ఉందట".

రెండడుగులు వెనక్కు వేసాను.

"మీరు స్వయంగా వచ్చారు. ఎట్టా?" ముసలయ్యా ఓ నిముషం ఆలోచించాడు. బుర్రగోక్కొని అన్నాడు "ఓ పది లీటర్లు ఇస్తాను సర్దుకోండి".

"తమ దయ ఉండాల" కిరసనాయిల్ డబ్బా యిస్తూ అన్నాడు ముసలయ్య,

డబ్బేమైనా ఎక్కువ అడుగుతాడేమోనని అనుకొని ఓ వంద రూపాయలిచ్చాను.

మామూలు రేటే పుచ్చుకొన్నాడు. డబ్బు వాపస్ ఇస్తూ అన్నాడు. "డబ్బుదేముంది బాబు, ఈ రోజు వస్తాది, రేపు పోతాది. గానీ మంచి ఉండిపోతాది".

"ఎంటో తేల్చి చెప్పు, నస పెట్టకు" నాకు విసుగొచ్చింది.

"తమరనుకొంటే కష్టం కాదు. మా మేనల్లుడు ఒకడున్నాడు. బి.ఎ. పాసయ్యాడు. తమరు దయతలచి ఏదైనా ఉద్యోగం..."

అదన్నమాట ముసలయ్య ఎత్తు!

"చూద్దాంలే" డబ్బా పుచ్చుకొని బయలుదేరాను.

ముసలయ్య నన్ను విడచిపెట్టలేదు. ఓ సాయంత్రం ఒక కుర్రవాడిని తీసికొని మా యింటికి వచ్చాడు.

"చూస్తానన్నాను కదా?" నాకింకా గేసు రాలేదు. కిరోసిన్ అవసరం.

"విన్నావుగదరా?" ముసలయ్య ఆ కుర్రవాడివేపు తిరిగి అన్నాడు. 'అయ్యగారు చూస్తాను అంటే చేసేసినట్టే. నువ్వేమి అనుమానించక మనం అనుకున్నది ఎల్లుండికల్లా చేతిలో పడిపోవాల"

ఆ కుర్రవాడిలాగే ఉన్నాడు వీడు.

"ముసలయ్య మీకేమవుతాడు" అడిగాను.

"ఏం కాదు. మా ఊరి వాడు"

"మరి మేనల్లుడన్నాడే..."

"వరసకలా అంటాడంతే" ఓ నిముషం ఆగి అన్నాడు ఆ యువకుడు.

"మీరు పెద్దవారు. ఇది మీకు న్యాయం కాదు"

నేను ప్రశ్నార్థకంగా చూసాను.

"వందో రెండొందలో కాదు పాతికవేలు. ఉద్యోగం ఇప్పించలేకపోతే నా డబ్బునాకు ఇచ్చేయండి".

నాకు షాక్ తగిలినట్లయింది.

"ఏమిటి నువ్వంటున్నది?"

"అదేనండి. ఉద్యోగం ఇప్పించటం కోసం ముసలయ్య మీకు ఆరు నెలల క్రితం ఇచ్చిన డబ్బు".

"సంగతి అర్థమయింది". మా బాస్ అన్నాడు "నువ్వెళ్ళు నేను చూస్తాను".

ఆ యువకుడు వెళ్ళిపోయాడు.

కోపంగా చూసాడు మా బాస్

"అయినా ఇంత ఆకలి పనికిరాదయ్యా. ఏకంగా పాతికవేలు ఒక్కడివే మింగేద్దామనే? అందులో సగం నాకు కొట్టు, కళ్ళు మూసుకుంటాను".

జుట్టు పీక్కుంటూ బయటకు వచ్చాను.

పాతిక వేలు నేను మింగలేదని, ఆ ముసలయ్యే మింగేదని, ఋజువు చెయ్యటం మెలా?

బలహీన వర్గాలని సానుభూతిపొందుతున్న వాళ్ళేమధ్యతరగతి వాళ్ళని ఎరగా వాడుతున్నారనే నా మొరవినేవాళ్ళెవరు?

ఆంధ్రభూమి దినపత్రిక ఏప్రిల్ 1992